## కే సెట్-2024 ఫలితాల్లో 'నారాయణ' ప్రతిభ

- 10లోపు 19 టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కే సెట్-2024 ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థ విద్యార్థులు ప్రతిభను చాటారని నారాయణ గ్రూపు డైరెక్టర్స్ సింధూర, శరణిలు తెలిపారు. 10లోపు 19 టాప్ ర్యాంకులు రాగా, అన్ని విభాగాల్లో 100లోపు 92 ర్యాంకులు, 1000లోపు మొత్తం 399 ర్యాంకులు నారాయణ విద్యార్థులకే వచ్చాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ నారాయణ విజయ ప్రస్థానం నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. కొన్నేండ్లుగా కే సెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో స్టేట్ టాప్ ర్యాంకులు నారాయణ విద్యార్థులు సొంతం చేసుకున్నారని వారు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ సిలబస్‌తో ప్రణాళికను అనుసరించి రూపొందించిన మైక్రో షెడ్యూలు, ఎక్స్‌పర్ట్స్‌చే స్టడీ మెటీరియల్‌ను అధ్యయం చేయడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు డైరెక్టర్లు ప్రత్యేకంగా అభినందించారు.

# పెద్దలకూ.. బీసీజీ టీకా

- టీబీ నియంత్రణకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శ్రీకారం
- పైలెట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలు
- ఒక డోసు టీకా ఇచ్చేందుకు ఏర్పాట్లు
- ఇంటింటి సర్వేతో వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ డాక్టర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ






రంగారెడ్డి, జూన్ 3(నమస్తే తెలంగాణ): ఇప్పటివరకు పిల్లలకు బీసీజీ వ్యాక్సిన్ ఇస్తుండగా, తొలిసారిగా 18 ఏండ్లు పైబడిన వారికి ఇచ్చేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయించింది. 2025వ సంవత్సరం నాటికి క్షయ నిర్మూలనే లక్ష్యంగా, జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే దేశంలో తొలి విడతగా ఎనిమిది రాష్ట్రాల్లో వ్యాక్సినేషన్ మొదలైంది. మలి విడతలో రాష్ట్రంలో 17 జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ఇందులో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలు ఉన్నాయి. బీసీజీ వ్యాక్సినేషన్ కార్యాచరణలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో సోమవారం ప్రభుత్వ దవాఖానలకు చెందిన డాక్టర్లు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చారు.

### క్షయ కట్టడికి కార్యాచరణ..

క్షయ (టీబీ - ట్యూబర్‌కులోసిస్) వ్యాధి క్రమంగా విస్తరిస్తోంది. వ్యాధి సోకినవారు సరైన పోషకాహారం, క్రమం తప్పకుండా మందులు వాడితే నయం చేయవచ్చు. లేదంటే ఈ వ్యాధితో ప్రాణానికే ప్రమాదం. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో ఈ వ్యాధి వేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఈ వ్యాధి కట్టడికి అనేక చర్యలు తీసుకుంటూ వస్తోంది. తాజాగా.., కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్దేశాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో 18 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకాను ఇవ్వనున్నారు. గుర్తించిన వ్యాధిగ్రస్తులకు ఒక డోసు టీకా ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎవరెవరికి టీకా ఇవ్వాలని గుర్తించేందుకు ఆరు కేటగిరీలను నిర్దేశించుకుని ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. జూలై చివరి వారం లేదా ఆగస్టు మొదటి వారంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ మొదలుకానుంది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్, వ్యాక్సినేషన్ కేంద్రాల్లో టీకాను ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి వివిధ స్థాయిల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

### ఎటువంటి దుష్ఫలితాలు ఉండవు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు

బీసీజీ టీకా వల్ల ఎటువంటి దుష్ఫలితాలు ఉండవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు అన్నారు. పెద్దలలో టీబీ వ్యాధి నివారణ కొరకై తయారైన బీసీజీ టీకా అధ్యయన కార్యక్రమంపై రంగారెడ్డి జిల్లాలోని కామినేని ఆసుపత్రి ఇందిరా ఆడిటోరియంలో పీహెచ్‌సీ, పల్లె దవాఖాన, బస్తీ దవాఖానలకు చెందిన డాక్టర్లు, సూపర్ వైజర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, 60 ఏళ్లు పైబడినవారందరికీ, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్నవారు, మద్యం తాగేవారు, ఇప్పుడు పొగ తాగుతున్న వారి, గతంలో పొగ తాగినవారు ఈ టీకా వేసుకునేందుకు అర్హులన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్నవారు, గత ఐదేళ్లలో క్షయ వ్యాధిగ్రస్తులున్న ఇంట్లోని ఇతర కుటుంబ సభ్యులు టీకా వేసుకోవచ్చని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ అరుణ కుమారి, యూఎన్‌డీపీ, ఎన్‌పీఎస్‌పీ ప్రతినిధులు డాక్టర్ స్నేహ శుక్లా, డాక్టర్ సుమలత, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ గీత, డాక్టర్ వినోద్, డాక్టర్ అనిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంబిక తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న మాజీ మంత్రి మల్లారెడ్డి, సీఎంఆర్ చైర్మన్ గోపాల్ రెడ్డి తదితరులు

## డల్లాస్‌లో సీఎంఆర్ అలూమ్ని మీట్

మేడ్చల్, జూన్ 3: అమెరికాలోని డల్లాస్‌లో సీఎంఆర్ విద్యా సంస్థల అలూమ్ని మీట్ జరిగింది. ఈ కార్యక్రమంలో అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, సీఎంఆర్ విద్యా సంస్థల చైర్మన్ చామకూర గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, సీఎంఆర్ విద్యా సంస్థల్లో చదివి, అమెరికాలో ఉన్నత స్థాయిలో స్థిరపడటం సంతోషంగా ఉందన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్న విద్యార్థులు కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండి, తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే, తాము పొందిన పరిజ్ఞానాన్ని, సంపాదనలో కొంత మొత్తాన్ని సమాజ హితం కోసం వెచ్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వీఎస్‌కే రెడ్డి, మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, యాజమాన్య కమిటీ సభ్యుడు ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

## విషపు నీరు తాగుతున్నాం

- కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి
- జల మండలి అధికారులకు నింబోలి అడ్డా వాసుల మొర

కాచిగూడ, జూన్ 3: కాచిగూడ డివిజన్‌లోని నింబోలి అడ్డా మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్ రావు వీధిలోని పలు ఇండ్లల్లో నెల రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నా జలమండలి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాసనతో కూడిన కలుషిత నీరును బస్తీలోని పిల్లలు, పెద్దలు సేవించి వాంతులు, విరోచనాలతో దవాఖానల పాలవుతున్నారని మాజీ కార్పొరేటర్ గోపాల్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కలుషిత నీరు తాగడంతో చిన్న పిల్లలకు కాళ్లు, చేతులకు దురదలు వస్తున్నాయని, చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని ఆయన వెల్లడించారు. నల్లాలో వస్తున్న నీరు కనీసం బట్టలు ఉతకడానికి కూడా పనికి రావడం లేదన్నారు. ఈ విషయమై స్థానిక కార్పొరేటర్, జల మండలి మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు మరమ్మతులు చేపట్టి కలుషిత నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నింబోలి అడ్డా వాసులు కోరుతున్నారు.



కలుషిత నీరును చూపిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్ రావు

## విద్యార్థులకు బస్ పాసుల జారీకి అంతా సిద్ధం

*18 ఏండ్లలోపు విద్యార్థినులకు ఉచిత పాసులు*

- 12 ఏండ్లలోపు విద్యార్థులకు ఉచిత పాసులు
- నగరంలో ప్రత్యేకంగా బస్ పాస్ కౌంటర్లు
- గ్రేటర్‌లో 43 బస్ పాస్ కేంద్రాలు: ఆర్టీసీ అధికారులు

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో 2024-25వ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్ పాసులను జారీ చేసేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేశామని గ్రేటర్ ఆర్టీసీ అధికారులు సోమవారం తెలిపారు. అన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలో సంబంధిత అడ్మినిస్ట్రేటివ్ చార్జీలను చెల్లించాలి. అదే సమయంలో ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థలు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించకుండా మినహాయింపు ఉందని అధికారులు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఫీజు చెల్లించిన ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు మాత్రమే బస్సు పాసులు ఇస్తామని అధికారులు తెలిపారు.

### బస్ పాసుకు దరఖాస్తు ఇలా...

విద్యార్థులు తమకు కావాల్సిన బస్సు పాసును టీజీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ (HTTP://TGSRTC.COM/)లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, తమ విద్యా సంస్థ నుంచి ఆన్‌లైన్‌లో ఫార్వార్డ్ చేయించుకొని దరఖాస్తు ఫారంపై ప్రిన్సిపాల్ సంతకం, విద్యా సంస్థ సీల్ వేయించుకొని వారు ఎంచుకున్న బస్ పాస్ కేంద్రంలో పాస్ పొందవచ్చని సూచించారు. జూన్ 1వ తేదీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని సుమారు 43 కేంద్రాల్లో బస్ పాసుల జారీ ఉంటుందని తెలిపారు.

### 18 ఏండ్లలోపు విద్యార్థినులకు ఉచిత పాసులు

విద్యా సంస్థల్లో 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినిలకు ఉచిత పాసులను జారీ చేస్తామని, అదే విధంగా ఏడో తరగతి చదవుతున్న 12 ఏళ్లలోపు విద్యార్థులందరికీ ఉచిత పాసులను జారీ చేస్తామని తెలిపారు. విద్యార్థుల అవసరాలను బట్టి నెల, మూడు నెలల పాసుల జారీ ఉంటుందని తెలిపారు. బస్ పాసుల జారీకి సంబంధించిన మరింత సమాచారం కోసం టీజీ ఎస్ఆర్టీసీ వెబ్‌సైట్, ఫోన్ నం. 80082 04216లో సంప్రదించాలని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూచించారు.

### బస్ పాసుల కేటగిరీలు ఇలా...

*స్టూడెంట్ జనరల్ పాస్(నెలకు) రూ.400.00*

*స్టూడెంట్ జనరల్ పాస్ (3 నెలలకు) రూ.1200.00*

*స్టూడెంట్ రూట్ పాస్ (3నెలలకు) 4 కి.మీకు రూ.450, 8 కి.మీ రూ.600, 12 కి.మీ రూ.900, 18 కి.మీ రూ.1150, 22 కి.మీ రూ.1350.00లు చెల్లించాల్సి ఉంటుంది.*

*స్టూడెంట్ గ్రేటర్ హైదరాబాద్ పాస్, స్టూడెంట్ సిటీ స్పెషల్ పాస్, స్టూడెంట్ ఎక్స్‌క్లూజివ్ పాస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్‌లను ఆయా కేంద్రాల్లో జారీ చేస్తారు.*

# శిథిల భవంతులపై నిర్లక్ష్యమెలా?

## నిన్న హఫీజ్‌పేట.. నేడు బాబుల్‌రెడ్డి నగర్

- భయపెడుతున్న పురాతన గోడలు, శిథిల భవనాలు
- రెండు ఘటనల్లో ముగ్గురు చిన్నారులు సహా మొత్తం నలుగురి మృతి
- స్పెషల్ డ్రైవ్ ఆలస్యమే.. ప్రమాదాలకు కారణం?





సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మొన్నటికి మొన్న.. గత నెల రెండో వారంలో హఫీజ్‌పేట డివిజన్ సాయినగర్ యూత్ కాలనీలో బాల్కని గోడ కూలి మూడేళ్ల బాలుడు సమద్‌తో పాటు రషీద్(51) చనిపోయారు. గత సోమవారం మైలార్‌దేవపల్లి బాబుల్‌రెడ్డి నగర్‌లో గోడ కూలి నూర్జహాన్ కటూన్(10), ఆఫ్రియా పర్వీన్(5)లు మృతి చెందారు. ఈ రెండు ఘటనల్లో భారీ వర్షానికి గోడలు తడిసి ముద్దయి కూలిపోయాయి. వాస్తవంగా పురాతన గోడలు, శిథిల భవనాల పట్ల జీహెచ్ఎంసీ ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంటుంది. ప్రతి ఏటా మాన్‌సూన్‌కు ముందుగానే జోన్ల వారీగా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనాలపై టౌన్ ప్లానింగ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. శిథిల, ప్రమాదకరమైన భవనాలలో ఉన్న నివాసితులను గుర్తించి, వారిని అక్కడిని నుంచి ఖాళీ చేయడానికి గాను వారికి ముందుగా కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. దాంతో పాటు అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు ఆయా భవనాల చుట్టూ బారికేడ్లను అమర్చాల్సి ఉంటుంది. వీటి పరిసర ప్రాంతాల్లోని నివాసితులు తగు జాగ్రత్తలు చేపట్టాల్సి ఉంటుంది. కాని, ఈ ఏడాది శిథిల, పురాతన భవనాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ ఆలస్యంగా ప్రారంభించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 498 శిథిల, పురాతన భవనాలను గుర్తించి అధికారులు గడిచిన 15 రోజులుగా 132 చోట్ల చర్యలు చేపట్టగా, పెండింగ్‌లో 366 ప్రాంతాలున్నాయి. ఒక్క చార్మినార్ జోన్‌లోనే 105, సికింద్రాబాద్‌లో 98, ఖైరతాబాద్‌లో 90 వరకు ఉండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. వచ్చే వారంలో వర్షాకాలం ప్రారంభం కానుండటం, పెండింగ్‌లో భారీగా పురాతన భవనాలు ఉండటంతో ప్రమాదకర భవనాల పట్ల స్థానికులు, నివాసితుల ప్రాణాల భద్రత గాలిలో దీపంలా మారింది. ఏదైనా ఘటన జరగక ముందే అధికారులు అప్రమత్తమై శిథిల భవనాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

### పురాతన, శిథిల భవనాల స్పెషల్ డ్రైవ్ వివరాలు

| జోన్ | మొత్తం గుర్తించినవి | కూల్చివేత /ఖాళీ చేపించినవి | పెండింగ్‌లో ఉన్నవి |
|---|---|---|---|
| ఎల్బీనగర్ | 62 | 39 | 23 |
| చార్మినార్ | 131 | 26 | 105 |
| ఖైరతాబాద్ | 117 | 27 | 90 |
| సికింద్రాబాద్ | 114 | 16 | 98 |
| శేరిలింగంపల్లి | 33 | 15 | 18 |
| కూకట్‌పల్లి | 41 | 9 | 32 |
| **మొత్తం** | **498** | **132** | **366** |

## దీర్ఘకాల సమస్యలను పరిష్కరించండి

- ఇన్‌చార్జి వీసీ దానకిశోర్‌కు అధ్యాపకుల వినతి



ఓయూ ఇన్‌చార్జి వీసీ దానకిశోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపక సంఘం ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 3: ఉస్మానియా యూనివర్సిటీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని అధ్యాపకులు ఇన్‌చార్జి వీసీ దానకిశోర్‌ను కోరారు. ఈ మేరకు ఓయూ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం ఆధ్వర్యంలో దానకిశోర్‌ను అధ్యాపకులు సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం, ప్రొఫెసర్ మల్లేశం మాట్లాడుతూ, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్, ఏరియర్స్, హెల్త్ కార్డులు, వయోపరిమితి పెంపు, సీపీఎస్ తదితర సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సత్వరమే సీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేసి, ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. సీపీఎస్, ఏరియర్స్‌కు సంబంధించి అవసరమైన పూర్తి సమాచారం, బడ్జెట్ వివరాలను అందించాల్సిందిగా సంబంధిత అధికారులను వీసీ కోరారని వివరించారు. ఎన్నికల కోడ్ ముగియగానే ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వయో పరిమితి పెంపు, ఆరోగ్య కార్డులపై ప్రభుత్వానికి నివేదించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఔటా ప్రతినిధులు ప్రొఫెసర్ సరస్వతమ్మ, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు సీహెచ్ శ్రీనివాస్, చంద్రశేఖర్, రాజేంద్రనాయక్, మంగు, చంద్రునాయక్, ఆమంచి నాగేశ్వర్, వంశీ, రమేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

## టీజీ పాలిసెట్ ఫలితాల్లో పేద విద్యార్థుల సత్తా



సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): టీజీ పాలిసెట్ - 2024 ప్రవేశ రీక్ష ఫలితాల్లో పేద విద్యార్థులు సత్తా చాటారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ప్రతి యేటా పేద విద్యార్థులకు పాలిసెట్ కోసం ఉచితంగా శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం ఆన్‌లైన్ కోచింగ్‌లో 300 మంది విద్యార్థులు జూమ్ యాప్ ద్వారా కోచింగ్ తీసుకోగా మరొక 500 మంది విద్యార్థులు వాట్సాప్ గ్రూపులలో స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకున్నారని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉషా రాణి తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులైన అనిత, అన్నపూర్ణ, రజిని కుమారి, గంగాభవాని, శ్రీధర్, లక్ష్మణ్‌లతో పాటు పలువురు విద్యార్థులకు శిక్షణను ఇచ్చారు. దాదాపు 50 రోజుల పాటు కొనసాగిన శిక్షణతో వందలాది మంది పేద విద్యార్థులు లబ్ధి పొందారని తెలిపారు. వెయ్యిలోపు ర్యాంకులు పది మంది సాధించగా, శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్క విద్యార్థి ఎంట్రెన్ పరీక్షల్లో అర్హత సాధించారని ఆమె తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయ శంకర స్వామి, సాధు త్రినాథ దాస్ తదితరులు

## 19న అందరికీ శ్రీహరే అంతరాత్మ పుస్తకావిష్కరణ

ఖైరతాబాద్, జూన్ 3: 'అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ' సంయుక్తాధ్వర్యంలో జై భారత్ పబ్లికేషన్ ద్వారా వెలువడిన 'అందరికీ శ్రీహరే అంతరాత్మ' పుస్తకాన్ని బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నట్లు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ సంస్థ అధ్యక్షులు సాధు త్రినాథ దాస్, జైభారత్ జాతీయ అధికార ప్రతినిధి మల్లికా వల్లభ, అన్నమయ్య గృహ సాధన సంస్థ ఉపాధ్యక్షులు శేషదరూరి, హిందూ ఆధ్యాత్మిక సాధకులు బీవీ రెడ్డి, బిర్లా మందిర్ ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహాచార్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్వేశం, అసహనం, అసమానత్వం, సంకుచితత్వం లాంటివి హిందూ మతంలో లేవన్నారు. శాంతియుత, సహజీవనమే ఈ వర్గాల వారు అనుసరిస్తారన్నారు. జూన్ 19న అన్నమయ్య జయంతి సందర్భంగా పుస్తకావిష్కరణతో పాటు 'ద్వేషం, అసమానత్వాలకు వ్యతిరేకంగా హిందూమతం' అనే అంశంపై సమ్మేళనం జరుగుతుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సాధువుల, సంత్‌లు, మత గురువులు, ఆధ్యాత్మికవేత్తలు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో జై భారత్ జంట నగరాల సమావేశాల సమన్వయకర్త బీఆర్ ప్రసాద్, విజయగీతామృతం నిర్వాహకులు విజయ్ రెడ్డి, నవనీత చోర బాలకృష్ణ మఠం ప్రతినిధి బాలకృష్ణాయానంద స్వామి, స్వార్థ భారతి వ్యవస్థాపకులు ఎడ్లపల్లి మోహన్ రావు పాల్గొన్నారు.

## విద్య, ఉద్యోగ అవకాశాలపై మిలో సీసీఎంబీ

- హౌజ్ కీపింగ్ స్టాఫ్ చిన్నారులకు ప్రవేశం




సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భావితరాలకు విజ్ఞాన రంగంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా తొలిసారిగా ప్రత్యేకమైన మిలో సీసీఎంబీని ఏర్పాటు చేసింది. సీసీఎంబీలో పనిచేసే హౌజ్ కీపింగ్ స్టాఫ్ సిబ్బంది పిల్లలకు సెంటర్‌లో ప్రవేశం కల్పించారు. లేబోరేటరీలో జరిగే పరిశోధనలు, జన్యు టెక్నాలజీ, ప్రోటిన్ విశ్లేషణ, కణాల పనితీరుపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం, సైంటిస్టులతో ప్రత్యేక ఇంటరాక్షన్ సమావేశంతో పాటు, సీసీఎంబీ డైరెక్టర్‌ను కలిసే అవకాశం కల్పించారు. విద్యార్థుల్లో లైఫ్ సైన్సెస్, విజ్ఞాన శాస్త్రంపై అవగాహన పెంచి, ఇక్కడ ఉండే విద్యా, ఉద్యోగ అవకాశాలపై ఆసక్తిని పెంచడమే మిలో సీసీఎంబీ ఉద్దేశమన్నారు.

## ఎన్నికల ఫలితాలు రిజల్ట్2024.ఇన్‌లో..

- యాప్‌ను రూపొందించిన సీఎంఆర్ విద్యార్థులు



మేడ్చల్, జూన్ 3: సీఎంఆర్ విద్యార్థులు ఎన్నికల ఫలితాలను తెలుసుకునేందుకు 'రిజల్ట్ 2024.ఇన్' యాప్‌ను రూపొందించారు. సీఎంఆర్ సెట్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గ్రేడియస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో ఎన్నికల ఫలితాల యాప్‌ను అభివృద్ధి చేశారు. ఈ యాప్ ద్వారా దేశం, రాష్ట్రంలోని ఏ నియోజకవర్గానికి చెందిన ఫలితాలను అయినా ఎప్పటికప్పుడు పొందవచ్చు. ఫలితాల విశ్లేషణ సమాచారం కూడా యాప్ ద్వారా లభిస్తుంది. యాప్‌ను రూపొందించిన విద్యార్థులను సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఏ నారాయణ, డైరెక్టర్ హిమబిందు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు అభినందించారు.



లక్ష్మీనగర్ చౌరస్తాలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపులో భాగంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు గున్నాల రంగారెడ్డి, సత్యనారాయణ గౌడ్ తదితరులు

- మెహిదీపట్నం జూన్ 3